ప్రైవేటు ఆసుపత్రులపై నజర్

- పకడ్బందీగా క్లినిక్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం అమలుకు చర్యలు
- 28 క్లినిక్‌లు, 7 డయాగ్నొస్టిక్ సెంటర్లను సీజ్ చేసిన వైద్య ఆరోగ్య శాఖ
- ఇష్టారాజ్యంగా దోపిడీ.. రోగులకు తప్పని తిప్పలు
- నగర శివారులో అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో ఆసుపత్రులు, క్లినిక్స్, డయాగ్నొస్టిక్ సెంటర్ల నిర్వహణ





సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రైవేటు ఆసుపత్రులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. శివారుల్లో జాతీయ, రాష్ట్రీయ రహదారుల ప్రాంతాల్లో పదుల సంఖ్యలో అనుమతి లేని ప్రైవేటు ఆసుపత్రులు దర్శనమిస్తున్నా.. పట్టించుకున్న వారే లేకపోవటంతో వారి ఫీజుల దోపిడీకి అడ్డూ, అదుపు లేకుండా పోతోంది. ఒక ఆసుపత్రికి అనుమతి తీసుకొని రెండు, మూడేసి బ్రాంచ్‌లు తెరుస్తున్నారు. ఎలాంటి పరిశీలన, విచారణ లేకుండానే వైద్యారోగ్య శాఖ అనుమతులు ఇస్తుందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. జిల్లాలో వందల సంఖ్యలో క్లినిక్‌లు, ఆసుపత్రులు ఇలానే నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. మెడికల్ షాపునకు కన్సల్టెంట్ క్లినిక్ పేరిట ఈ ఆసుపత్రులు ఏర్పాటు చేస్తున్నారు. అవసరం లేకున్నా రకరకాల వైద్య పరీక్షలు చేస్తూ.. పేదల రక్తం పీల్చుతున్నారు. రోగుల నుంచి అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, అల్ట్రా సౌండ్ సెంటర్లపై వైద్యశాఖకు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను పట్టించుకోకుండా.. ఉల్లంఘించిన ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్లపై చర్యలకు జిల్లా వైద్యారోగ్యశాఖ నజర్ పెడుతోంది.

నిబంధనలు ఇలా..

అల్లోపతి ప్రైవేటు మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, కన్సల్టెంట్ క్లినిక్‌లు, ఆయుష్ క్లినిక్‌లు, ఫిజియోథెరపి కేంద్రాలు అన్నింటికి అనుమతి తప్పనిసరి. నిబంధనల ప్రకారం జిల్లా వైద్యారోగ్యశాఖలో దరఖాస్తు చేసుకోవాలి. అలా దరఖాస్తు చేసుకున్న ఆసుపత్రి, క్లినిక్, డయాగ్నొస్టిక్ కేంద్రాల నిర్వాహకులు అందులో పనిచేసే వైద్యుల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలి. అగ్నిమాపక, పొల్యూషన్, మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్‌తో సహా తదితర అన్నీరకాల పత్రాలు సరిగ్గా ఉన్నప్పుడే ఆసుపత్రుల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాల్సి ఉంటోంది.

ఫిర్యాదులతోనే తనిఖీలు.. చర్యలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో జిల్లా వైద్యారోగ్యశాఖ వైద్య బృందం ఉప్పల్, చిలుకానగర్, పీర్జాదిగూడ, చింతల్, నాచారం, బోడుప్పల్, కూకట్‌పల్లి, మల్లాపూర్, ఏఎస్‌రావునగర్, దమ్మాయిగూడ, దుండిగల్, మల్కాజిగిరి, సఫల్‌గూడ, కుషాయిగూడ, నాగారం,సైనిక్‌పురి, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న 28 క్లినిక్‌లను సీజ్ చేసింది. 7 డయాగ్నొస్టిక్, స్కానింగ్, అల్ట్రా సెంటర్లను కూడా జిల్లా వైద్యారోగ్యశాఖ మూసివేసింది. అలాగే, జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పలు ప్రైవేట్ ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పలు కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులకు రాజకీయ అండదండలు ఉండటంతో.. షోకాజ్ నోటీసులతోనే జిల్లా వైద్యారోగ్యశాఖ సరిపెడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల అనుమతి లేని క్లినిక్‌లు, ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్లపై జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులతోపాటు ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు అందుతున్నాయి. రోగుల నుంచి అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న సంఘటనలపై కూడా వినతులు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కొనసాగుతున్న క్లినిక్‌లు, ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు, ఫిజియోథెరపీ, డయాగ్నొస్టిక్ సెంటర్లు, రీహాబిలిటేషన్ సెంటర్లపై చర్యలు తీసుకునేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖ సిద్ధమవుతోంది. అలాగే, ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్, అనుమతులు తదితర అంశాలపై కూడా వైద్యారోగ్యశాఖ ఆరా తీస్తోంది.

అనుమతిలేని ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు ఎక్కువే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2,600 పైగా ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు ఉండగా, ఇందులో రిజిస్ట్రేషన్‌తో సహా వివిధ అనుమతితో కొనసాగుతున్నట్లు ఆసుపత్రులు 1705 మాత్రమే ఉన్నాయి. ఏలాంటి అనుమతి లేని ప్రైవేటు ఆసుపత్రులు 895 ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ అంచనా వేస్తోంది. అనుమతులు ఉన్న ఆసుపత్రుల్లో వంద కంటే ఎక్కువ పడకలు (బెడ్స్) ఉన్న ప్రైవేటు ఆసుపత్రులు 48 ఉండగా, 20 నుంచి 100 పడకలు (బెడ్స్) ఉన్న ఆసుపత్రులు 317 ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ పేర్కొంటోంది. 20 పడకలు (బెడ్స్) ఉన్న ఆసుపత్రులు 294 ఉన్నాయి. అలాగే, 712 పాలీక్లినిక్‌లు, క్లినిక్‌లు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, 180 డెంటల్ ఆసుపత్రులు, 46 ఫిజియోథెరపీ సెంటర్లు, 08 రీహాబిలిటేషన్ సెంటర్లు, అలాగే, 628 అనుమతి పొందిన స్కానింగ్ సెంటర్లు 628 ఉన్నాయి. ఏలాంటి అనుమతి లేని సాన్కింగ్ సెంటర్లు 400 వరకు ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ అంచనా వేస్తోంది.

ఫీజుల వసూళ్లు ఇష్టారాజ్యంగా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఇష్టారాజ్యంగా ఫీజుల వసూళ్లు మొదలుకొని వైద్య పరీక్షలు తదితర వాటిల్లో కొనసాగుతున్న దోపిడీని పసిగట్టిన జిల్లా వైద్యారోగ్యశాఖ ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని సూచిస్తోంది. ఈ బోర్డుల మీద ఫీజుల ధరల వివరాల పట్టికతో సహా డాక్టర్లు, సిబ్బంది, పడక మంచాల సంఖ్య వంటి సమాచారాన్ని పొందుపర్చాలని ఆదేశాలు జారీ చేసింది.

ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు



ప్రభుత్వ నిబంధలు, ప్రమాణాలు పాటించని, వసతులు, నిబంధనలు ఉల్లంఘన ఆరోపణలపై పలు క్లినిక్‌లు, ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్లపై విచారణ జరుగుతోంది. వసతులు లేకుండానే ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేసే ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.

–డా.రఘునాథ్‌స్వామి,డీఎంహెచ్‌ఓ, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి



ఐటీఐ భవనంలో వివరాలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని కొండాపూర్‌లో నూతనంగా నిర్మించిన బాలికల ఐటీఐ భవనాన్ని చైర్‌పర్సన్ పావనీజంగయ్య శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా బాలికల విద్యాభివృద్ధికి హెచ్‌ఏఎల్ రూ. 7 కోట్లతో ఐటీఐ భవనం నిర్మించడం అభినందనీయమన్నారు. డిసెంబర్ 10 లోపు భవనం ప్రారంభించనున్నందున యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని, కళాశాల ఆవరణ, చుట్టు పక్కల ప్రాంతాల్లో చెత్త చెదారం లేకుండా శుభ్రం చేయాలని ఆదేశించారు. అనంతరం భవనంలో ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శంకరయ్య, డీటీఓ సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ అనిల్, ఇన్‌చార్జి సురేందర్, ఇతర అధికారుల, స్థానికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యార్థులకు చేయూతను అందించడమే లక్ష్యం



మేడ్చల్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలకు చేయూతనందించడమే లక్ష్యమని డిలైట్ ప్రతినిధుల బృందం తెలిపారు. శుక్రవారం మేడ్చల్ మండలం, రాజబొల్లారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో డిలైట్ ఇంపాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులతో గడిపి వివిధ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు స్టేషనరీని అందజేశారు. విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యతను విద్యార్థులు నేర్చుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భార్గవి, సాయి కుమార్, 14 మందితో కూడిన డిలైట్ బృందం పాల్గొన్నారు.

టీచర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ కార్యవర్గం



మేడ్చల్: ఉపాధ్యాయులకు చెందిన టీచర్స్ కోఆపరేటివ్ సొసైటీ మండల కార్యవర్గంను శుక్రవారం మేడ్చల్‌లో ఎన్నుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో సమావేశమైన ఉపాధ్యాయులు కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మధుసూధన్‌రెడ్డి (పీఆర్‌టీయు), ట్రెజరర్‌గా ప్రేమ్‌కుమార్(ఎస్‌టీయు), ప్రధాన కార్యదర్శిగా జ్యోతి, ఉపాధ్యక్షుడిగా కుమార్, డైరెక్టర్లుగా వెంకట్‌రెడ్డి, మురళీ, కృష్ణమూర్తి, పుష్పలత తదితరులను ఎన్నుకున్నారు. ఎన్నికలకు అధికారిగా రాంబాబు వ్యవహరించగా, సమావేశంలో జిల్లా పీఆర్‌టీయు అధ్యక్షుడు రామేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

కీసరలో.. మేడ్చల్‌జిల్లా టీచర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్‌గా యాద్గార్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వంగేటి వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారు. 52 సంవత్సరాల చరిత్ర కలిగిన సొసైటీ ఎన్నికలను శుక్రవారం తెలంగాణ కో–ఆపరేటివ్ సొసైటీ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించారు. చైర్మన్‌తోపాటు ఇతర కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది.

వికలాంగులకు పెంచిన పెన్షన్ చెల్లించాలని వినతి



ఘట్‌కేసర్: అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీ అనుసరించి పెంచిన పెన్షన్‌ను వెంటనే చెల్లించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యలయంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. గత ఎన్నికల్లో వికలాంగులకు రూ. 6 వేలకు పెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చారని లేఖలో గుర్తు చేశారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల అధ్యక్షుడు చంద్రమోహన్, కార్యదర్శి రజనిరెడ్డి, ఘట్‌కేసర్ సభ్యులు రఘు, లింగం, జ్ఞానేశ్వర్, షకిల్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష పద్ధతిలో మార్పులు వద్దు

సాక్షి,సిటీబ్యూరో: ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి పరీక్ష పద్ధతుల్లో మార్పులు చేయకుండా యధావిధిగా నిర్వహించాలని ఎస్‌ఎఫ్‌ఐ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షలకు 90 రోజుల ముందు పరీక్షల్లో మార్పుల నిర్ణయం తీసుకోవటం వల్ల విద్యార్థులు తీవ్ర గందరగోళానికి గురయ్యే అవకాశముంటుందన్నారు. పరీక్షల పద్ధతిలో తీసుకునే మార్పులను వచ్చే విద్యా సంవత్సరం నుంచి తీసుకుంటే విద్యార్థులు ఆ విధానంతో పరీక్షలకు సిద్ధమవ్వటానికి వీలుంటుందని ఆయన తెలిపారు. పరీక్షల్లో ప్రస్తుత మార్పుల వల్ల మార్కులలో అసమానతలు పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

కళాశాలల్లో అవగాహన సదస్సు

కీసర: డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న మంచి సంకల్పంలో విద్యార్థులు–భాగస్వామ్యులు కావాలని కీసర సీఐ వెంకటయ్య అన్నారు. శుక్రవారం చీర్యాలలోని గీతాంజలీ ఇంజనీరింగ్ కళాశాల్లో తెలంగాణ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధకం, మహిళల భద్రతపై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగం, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు డ్రగ్స్ భారిన పడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కీసర అరుంధతీ పాఠశాల్లో నిర్వహించిన ఎస్.ఐ. వెంకటేష్ పాల్గొని విద్యార్థులకు డ్రగ్స్ నివారణ, మహిళ భద్రతపై అవగాహన కల్పించారు. ఎస్.ఐ. నాగారాజు, ప్రిన్సిపాల్ రవికుమార్, ఏఓ రవీందర్, హెచ్ఓడీ అంజనేయులు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేత

కీసర: రాంపల్లిదాయరలోని దాయరకుంట చెరువు బఫర్ జోన్ స్థలాన్ని కాపాడాలని కోరుతూ శుక్రవారం కందాడి అంజిరెడ్డి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. సర్వేనెంబర్ 4571 లోని చెరువు భూమిలో కొంత భాగంగా కబ్జాకు గురైందని, సదరు చెరువు స్థలాన్ని కాపాడాలని కోరారు.

విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు



ప్రతిభా పరీక్ష తీరును పరిశీలిస్తున్న గణిత ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు రాజు తదితరులు

కీసర: జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులలో గణిత సామర్థ్యాలను వెలికి తీయడంతోపాటు, గణతం పట్ల ఆసక్తిని పెంపొందించడానికి ఉపయోగపడే విధంగా ప్రతి సంవత్సరం ప్రతిభా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలంగాణ గణిత ఫోరమ్ మేడ్చల్ జిల్లాశాఖ అధ్యక్షులు రాజు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తెలంగాణ గణిత ఫోరమ్ మేడ్చల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షల్లో రాణించిన విద్యార్థులకు ప్రతి మాధ్యమం నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్న విద్యార్థులకు మెడల్ మరియు సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో గణిత ఫోరమ్ మేడ్చల్‌జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందిర, గౌరవ అధ్యక్షులు గోవింద్, వివిధ మండలాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గణిత నైపుణ్య పరీక్ష

శామీర్‌పేట్: తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గణిత నైపుణ్య పరీక్షను శుక్రవారం నిర్వహించారు. తెలంగాణ మ్యాథ్స్ ఫోరం మేడ్చల్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి గణితం నైపుణ్య పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లోని వివిధ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు ప్రశంసా పత్రాలతో బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా తెలంగాణ మాథ్స్ ఫోరం అధ్యక్షుడు రాజు, శామీర్‌పేట మండల అధ్యక్షురాలు రజిని, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

వీఆర్‌ఓల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వీఆర్‌ఓ ఉపేందర్‌రావు

శామీర్‌పేట్: డిసెంబర్ 1న జరిగే వీఆర్‌ఓల ఆత్మీయ సమ్మేళనానికి వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు భారీగా తరలి రావాలని తెలంగాణ వీఆర్‌ఓల (గ్రామ రెవెన్యూ అధికారి) సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గరికె ఉపేందర్‌రావు అన్నారు. శుక్రవారం తూంకుంట మున్సిపాలిటీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో వీఆర్‌ఓ వ్యవస్థను రద్దు చేసి, ఉద్యోగులను ఇటు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. తిరిగి రెవెన్యూ శాఖలోకి వీఆర్‌ఓలను తీసుకోవాలని ప్రభుత్వాన్ని విన్నవిస్తున్నామన్నారు. ఈ మేరకు డిసెంబర్ 1న తూంకుంటలోని వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ రాష్ట్ర వీఆర్‌ఓల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్‌రావు, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు మాణిక్యం, సత్యం, కిషోర్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు



కీసర: కీసరలోని సర్వేనెంబర్ 315లో గల ప్రభుత్వ స్థలాన్ని కొంత మంది వ్యక్తులు అక్రమంగా కబ్జాకు పాల్పడుతున్నారని, సదరు ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే కీసర–భోగరాం ప్రధాన రహదారి నుంచి రెడ్డిగూడెం వరకు కీసర రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 315లో సుమారు 7 ఎకరాల వరకు ప్రభుత్వ స్థలం ఉందని, ఈ ప్రభుత్వ స్థలాన్ని ఆనుకొని ఉన్న పట్టానెంబర్‌లో వెలసిన లేఔటులో ప్లాట్లు కొనుగోలు చేసిన కొందరు వ్యక్తులు ప్రభుత్వ స్థలాన్ని సైతం ఆక్రమించి ప్రహరీగోడలు ఏర్పాటు చేసుకుంటున్నారని వాపోయారు. గతంలో కూడా కొందరు ఇదేవిధంగా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తే రెవెన్యూ అధికారులు ప్రహరీగోడలను కూల్చివేయించారన్నారు. తిరిగి ఇప్పుడు మరోమారు ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతమౌతుందని, ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో స్పందించి, కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

డిసెంబర్ 2న ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల వేలం

పోచారం: ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న మూడు వాహనాలను వచ్చే నెల 2న ఉదయం 11 గంటలకు నారపల్లిలోని ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం వేస్తున్నట్లు సీఐ జూపల్లి రవి తెలిపారు. వేలం వేస్తున్న వాహనాల్లో మారుతి ఆల్టో కారుకు రూ. 50 వేలు, పల్సర్ బైక్‌కు రూ. 66 వేలు, టాటా ఇండికా కారుకు రూ. 1.05 లక్షల నుంచి పాట మొదలవుతుందన్నారు. ఇతర వివరాలకు 8712658736, 9642377661, 9640097624 నెంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

వంట పాత్రల అందజేత



మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండేందుకు గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు రాఘవరెడ్డి, వంశీదర్‌రెడ్డి వారి తల్లి జాన్సిరాణి కుటుంబం వంట పాత్రలను విరాళంగా అందజేశారు. వారి తల్లిదండ్రులు సులోచనమ్మ, రాంరెడ్డి జ్ఞాపకంగా వంట పాత్రలను పిల్లల కోసం అందజేసినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం తాము ఎప్పుడూ తమ సహకారం అందించడానికి ముందుంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆంజనేయులు, హన్మంత్‌రెడ్డి, నాగర్జున్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, అజార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమించలేదు

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమించామని కొంతమంది అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని గ్రామానికి చెందిన నవీన్‌చందర్‌రెడ్డి అన్నారు. గ్రామంలోని 341 సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమి ఆక్రమించుకుని గోదాంలు నిర్మిస్తున్నారని జిల్లా కలెక్టర్‌కు తప్పుడు ఫిర్యాదు చేస్తున్నారని అన్నారు. బ్లాక్‌మెయిల్ చేస్తూ తాము లొంగకపోతే తమ పరువు తీయడానికి చిల్లర రాజకీయాలు చేస్తున్నారన్నారు. తాము గ్రామానికి 160 ఎకరాల భూమి ఇచ్చామని, తాము ప్రభుత్వ భూమి ఎందుకు ఆక్రమిస్తామని ప్రశ్నించారు. అధికారులు ఎప్పుడైనా విచారణ చేసుకోవచ్చని ఆయన అన్నారు. తమ పై బురద జల్లుతున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీజేపీ నాయకుల అరెస్ట్

పోచారం: బీజేపీ పార్టీ చేపట్టిన తెలుగు సంక్షేమ భవన్ ముట్టడి కార్యక్రమంలో పోచారం మున్సిపాలిటీకి చెందిన బీజేపీ నాయకులను పాల్గొనసీయకుండా పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు నాయకులను అరెస్ట్ చేసి పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో బీజేపీ ఎస్టీ మోర్చా జాతీయ నాయకుడు బిక్కునాథ్ నాయక్, స్థానిక నాయకులు సురేష్, బాలేష్, రాజా రమేష్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

రైతులను తరలించేందుకు ఆర్టీసీ బస్సులు

నేడు మహబూబ్‌నగర్‌లో రైతు పండుగ సభ

సాక్షి,సిటీబ్యూరో: కొత్త ప్రభుత్వం పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం మహబూబ్‌నగర్‌లోని అమిస్తాపూర్‌లో నిర్వహిస్తున్న రైతు పండుగ బహిరంగ సభకు మేడ్చల్ జిల్లా నుంచి రైతులను పెద్ద ఎత్తున తరలిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ తెలిపారు. ఇందుకోసం మూడుచింతలపల్లి, అలియాబాద్, కీసర రైతు వేదికలు, మేడ్చల్ మండల వ్యవసాయ కార్యాలయం, ఎదులాబాద్‌లలో ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సంవత్సర కాలంలో ప్రజా ప్రభుత్వం రైతు రుణమాఫీతో పాటు రైతు భరోసా, ధాన్యం కొనుగోళ్లు, సన్న వడ్లకు బోనస్, రైతు భీమా తదితర పథకాల ద్వారా రూ.50 వేల కోట్లు రైతులకు అందించినట్లు ఆమె తెలిపారు.

రైతుల వేదిక వద్ద సీఎం సభ ప్రత్యక్ష ప్రసారం

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కీసర, మూడు చింతలపల్లి మండల కేంద్రాలతోపాటు అలియాబాద్, (శామీర్‌పేట మండలం), ప్రతాప్‌సింగారం (ఘట్కేసర్ మండలం), రాయలాపూర్ (మేడ్చల్) రైతు వేదికల వద్ద వీడియో కాన్ఫరెన్స్ సెట్ల ద్వారా మహబూబ్‌నగర్‌లోని అమిస్తాపూర్ రైతు బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడే ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లు చంద్రకళ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ఒంటెత్తు పోకడలు చైర్మన్ మానుకోవాలి

ఘట్‌కేసర్: ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి ఒంటెత్తు పోకడలు మానుకోవాలని, సమావేశంలో ప్రశ్నలడిగితే బయటకు వెళ్లమంటారా ? పోలీసులకు పట్టిస్తాననడం సమంజసం కాదని డైరెక్టర్ ధర్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డిఫెన్స్ అకాడమీ అద్దె విషయంలో తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. ఇష్టానుసారంగా రవాణ అలెవెన్స్‌లు, గౌరవ వేతనం తీసుకుంటున్నాడని, సమావేశంలో ఎక్కువ మాట్లాడొద్దనడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయమై చైర్మన్ రాంరెడ్డిని వివరణ కోరగా సహకార సంఘంలో అవనీతికి తావులేకుండా వ్యవహరిస్తున్నామన్నారు. డైరెక్టర్ ధర్మారెడ్డి.. రిజిస్టర్ ఇచ్చినా సంతకం చేయలేదని, టెండర్ పరిధిలో లేని కారణంగా ఎరువులు నిల్వచేయడానికి నూతన భవనం నిర్మించామని, డిఫెన్స్ అకాడమీ 10 ఏళ్ల అగ్రిమెంట్ విషయంలో ఐదేళ్ల అగ్రిమెంట్, మరో ఐదేళ్లు మ్యూచువల్‌గా ఒప్పందం ఉందన్నారు. చట్టప్రకారమే గౌరవ వేతనం తీసుకుంటున్నానని అన్నారు.

అసమర్థ పాలన సాగుతోంది



పోలీసుల అదుపులో సుదర్శన్‌రెడ్డి, బీజేపీ నాయకులు

ఘట్‌కేసర్: తెలంగాణలో అసమర్థ పాలన సాగుతోందని, బడిపిల్లల బతుకులకు భరోసా లేకుండా పోయిందని మాజీ ఎంపీపీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ హాస్టలల్లో ఆహార పదార్థాల కల్తీపై ప్రశ్నించినందుకు పలువురి బీజేపీ నాయకులను శుక్రవారం ఘట్‌కేసర్ పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న తీరును ప్రశ్నిస్తే ప్రజా గొంతుకలను నొక్కుతున్నారన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మశ్చేందర్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సాయి పాల్గొన్నారు.

సమాజానికి మేలు చేసే ఆవిష్కరణలు చేయాలి



జాతీయ సదస్సులో మాట్లాడుతున్న బాలప్రసాద్

ఘట్‌కేసర్: సమాజానికి మేలు చేసే ఆవిష్కరణలు ఆవిష్కరించాలని టెక్నాలజీ అడ్వైజరీ సరీవ్సెస్, టెక్నికల్ అండ్ సాఫ్ట్‌వేర్ బిజినెస్ గ్రూపు చీఫ్ ఇన్నోవేషన్ గ్లోబల్ హెడ్ బాలప్రసాద్ అన్నారు. మున్సిపాలిటీలోని కొండాపూర్ సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం కృత్రిమ మేధస్సుపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సదస్సులు పరిశోధనలు, ఆలోచనలు పంచుకోవడానికి వేదిక అవుతాయన్నారు. సదస్సులో 250 మందికి పైగా ప్రతినిధులు తమ పరిశోధన పత్రాలు సమర్పించారు. ప్రముఖ ఇంజనీరింగ్ నిపుణులు చంద్రమోహన్, గోపి కృష్ణ వర్చువల్‌గా కృత్రిమ మేధస్సు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై తాజా పరిణామాలపై విలువైన సమాచారాన్ని అందించారు. కార్యక్రమంలో సంస్కృతి విద్యాసంస్థల డైరెక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి, ప్రొఫెసర్ అసీస్‌బాబు, ప్రిన్సిపాల్ జానకి, ప్రొఫెసర్ శివకేశవరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న బాలప్రసాద్, రమాకాంత్‌రెడ్డి